సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం । 4 । డిసెంబర్ । 2023



ఎన్నికల ప్రక్రియ ప్రశాంతం

జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. 12లో



రీ షెడ్యూలా? పాత షెడ్యూలా?

సింగరేణి గుర్తింపు ఎన్నికలను ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తారా? లేదా అనే సందిగ్ధం నెలకొంది. 12లో

గరిష్టం / కనిష్టం
26° / 22°

వాతావరణం

జిల్లాలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల చిరు జల్లులు కురుస్తాయి. రాత్రి వాతావరణం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

తొలిసారి స్థానిక అభ్యర్థి విజయం

రికార్డు బ్రేక్ చేసిన 'తెల్లం'

భద్రాచలం: భద్రాచలం నియోజకవర్గ ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు 17 సార్లు ఎన్నికలు జరిగాయి. అయితే ఇక్కడ గెలుపొందిన వారంతా నియోజకవర్గ కేంద్రానికి చెందిన వారు కాకుండా ఇతర మండలాల వారే. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా విజయం సాధించిన తెల్లం వెంకట్రావుది దుమ్ముగూడెం మండలం సూరారం గ్రామమైనా.. రెండు దశాబ్దాలుగా భద్రాచలంలోనే స్థిర నివాసం ఏర్పర్చుకొని వైద్య సేవలు అందిస్తున్నారు. ఇలా తెల్లం వెంకట్రావ్ స్థానిక అభ్యర్థిగా తొలిసారి నిలిచారు. పేదల వైద్యుడిగా మన్ననలు అందుకున్న వెంకట్రావ్ ఈ రికార్డును బ్రేక్ చేశారు. కాగా తెల్లం వెంకట్రావ్ గెలుపులో దుమ్ముగూడెం, భద్రాచలం మండలాలే కీలక పాత్ర పోషించడం విశేషం.

'హ్యాండ్' ఇచ్చిన వారికి తప్పని ఓటమి

బూర్గంపాడు: గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలిచి ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరిన వారికి ఈ ఎన్నికల్లో ఓటమి తప్పలేదు. 2018లో కాంగ్రెస్ నుంచి గెలిచిన వనమా వెంకటేశ్వరరావు, రేగా కాంతారావు, బానోత్ హరిప్రియ, టీడీపీ నుంచి గెలిచిన మెచ్చా నాగేశ్వరరావు ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. ఈ ఎన్నికల్లో వారు బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి ఘోరంగా ఓడిపోయారు. గత ఎన్నికల్లో టీఆర్ఎస్ నుంచి పోటీ చేసి ఓటమి పాలైన పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య ప్రస్తుతం కాంగ్రెస్ అభ్యర్థులుగా ఘన విజయం సాధించారు. గత ఎన్నికల్లో భద్రాచలం నుంచి టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలైన డాక్టర్ తెల్లం వెంకట్రావు ఈ ఏడాది జనవరిలో మాజీ ఎంపీ పొంగులేటితో కలసి కాంగ్రెస్‌లో చేరారు. ఆ తర్వాత మళ్లీ బీఆర్ఎస్‌లో చేరి భద్రాచలం నుంచి పోటీ చేసి గెలుపొందారు.

భద్రాచలంలో సెంటిమెంట్ పునరావృతం

భద్రాచలం: భద్రాచలంలో కొన్నేళ్లుగా కొనసాగుతున్న సెంటిమెంట్ పునరావృతమైంది. ఇక్కడ ఏ పార్టీ అభ్యర్థి గెలిస్తే ఆ పార్టీ రాష్ట్రంలో అధికారం రాదనేది రివాజు. 2004లో కుంజా సత్యవతి గెలవగా అప్పుడు మాత్రమే వైఎస్సార్ అధికారం చేపట్టారు. అంతకు ముందు, ఆతర్వాత ఎన్నడూ ఇలా జరగలేదు. 2014 ఎన్నికల్లో ఇక్కడ సీపీఎం అభ్యర్థి గెలవగా, 2018లో రాష్ట్రమంతా బీఆర్ఎస్ హవా కొనసాగినా భద్రాచలంలో కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్య గెలిచి ప్రతిపక్ష హోదాలో కొనసాగారు. ఈసారి రాష్ట్రమంతా కాంగ్రెస్ హవా కొనసాగితే భద్రాచలంలో మాత్రం బీఆర్ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావుకు ఇక్కడ ప్రజలు పట్టం కట్టడం విశేషం.

మూడో 'సారీ' ఒక్కటే

భద్రాచలం: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్‌కు ఒకేఒక్క సీటు సెంటిమెంట్ కొనసాగుతోంది. 2014 ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున కొత్తగూడెం నియోజకవర్గంలో జలగం వెంకట్రావు గెలిచారు. అనంతరం 2018 ఎన్నికల్లో ఖమ్మం నియోజకవర్గంలో పువ్వాడ అజయ్‌కుమార్ ఒక్కరే బీఆర్ఎస్ తరఫున విజయం సాధించారు. ఇక 2023 ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భద్రాచలంలో తెల్లం వెంకట్రావ్ బీఆర్ఎస్ నుంచి గెలుపొందారు. ఇలా ప్రతీ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒక్కో సీటును గెలుస్తున్న బీఆర్ఎస్‌కు మూడోసారి భద్రాచలం స్థానం దక్కింది.

హస్తగతం

ఉమ్మడి ఖమ్మంలోని ఎనిమిది స్థానాల్లో కాంగ్రెస్ ఘనవిజయం

- గూడెంలో కూనంనేని విజయం
- భద్రాచలంలో 'తెల్లం'కు పట్టం
- కనకయ్యకు భారీ మెజారిటీ
- జిల్లాలో కాంగ్రెస్ ప్రభంజనం

పోలింగ్‌కు వారం రోజుల ముందు నుంచే కాంగ్రెస్ గాలి వీస్తోందన్న భావన జిల్లా వ్యాప్తంగా నెలకొంది. ఎగ్జిట్ పోల్ ఫలితాల్లోనూ హస్తానిదే హవా అని తేలింది. ఫలితం ఊహించిందే అయినా ఈ స్థాయిలో ఉటుందని కాంగ్రెస్ శ్రేణులే అంచనా వేయలేకపోయాయి. భద్రాచలం మినహాయిస్తే మిగిలిన చోట్ల భారీ మెజారిటీతో కాంగ్రెస్, సీపీఐ అభ్యర్థులు జయకేతనం ఎగురవేశారు.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

తీర్పు ఏకపక్షం..

కొత్తగూడెం నియోజకవర్గంలో త్రిముఖ పోరు ఉన్నట్టుగా రాజకీయ వర్గాలు అంచనా వేశాయి. కానీ కౌంటింగ్‌లో ఎక్కడా త్రిముఖ పోరు కనిపించలేదు. మొదటి రౌండ్ నుంచి చివరి రౌండ్ వరకూ కాంగ్రెస్ మద్దతుతో పోటీ చేసిన సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు ఆధిక్యం కనబరిచారు. ఏ ఒక్క రౌండ్‌లోనూ ఆయనకు ప్రత్యర్థుల నుంచి పోటీ ఎదురు కాలేదు. పల్లె, పట్నం అనే తేడా లేకుండా జెట్ స్పీడ్‌తో ఆయన దూసుకుపోయారు. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ క్రాస్ ఓటింగ్‌పై గంపెడాశలు పెట్టుకున్న ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థి జలగం వెంకట్రావు రెండో స్థానంతో సరిపెట్టుకున్నారు. నామినేషన్ దాఖలు చేసిన సమయంలో గెలుపు నల్లేరు మీద నడకే అనుకున్న బీఆర్ఎస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు మూడో స్థానంలో నిలవడం గులాబీ శ్రేణులకు మింగుడుపడని నిజంగా మారింది.

ప్రజలు 'మెచ్చ'లేదు

రెండు నెలలు ముందుగానే అభ్యర్థిత్వం ప్రకటించినా అశ్వారావుపేట నియోజకవర్గంలో మెచ్చా నాగేశ్వరరావు ప్రచారంలో దూకుడు చూపించలేదు. పైగా నామినేషన్ల పర్వం మొదలయ్యే నాటికి ఇతర పార్టీల నుంచి పెద్ద సంఖ్యలో నేతలు బీఆర్ఎస్‌లోకి వలస వచ్చారు. కానీ ఈ సువర్ణ అవకాశాన్ని మెచ్చా చేజార్చుకున్నారు. తొలిసారిగా ఎన్నికల్లో పోటీ చేసిన జారే ఆదినారాయణ చేతిలో ఓటమి పాలయ్యారు. ఏ ఒక్క రౌండ్‌లోనూ మెచ్చా నుంచి జారేకు గట్టి పోటీ ఎదురుకాలేదు.

బంపర్ మెజారిటీతో 'కోరం'

ఇల్లెందులో కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య, బీఆర్ఎస్ అభ్యర్థి హరిప్రియానాయక్‌పై భారీ మెజారిటీతో విజయం సాధించారు. కోరం కనకయ్యకు వచ్చిన మెజారిటీ కంటే హరిప్రియకు తక్కువ ఓట్లు దక్కడం గమనార్హం. గణనీయ స్థాయిలో అభివృద్ధి పనులు చేసినా హరిప్రియ దారుణంగా ఓడిపోయారు. ఆమె ఓటమికి లోతైన విశ్లేషణలు, భారీ వర్ణనలు అక్కర్లేదని రాజకీయ వర్గాలు అంటున్నాయి. 'హరిసింగ్' అనే ఒకే ఒక్క పదం ఆమె దారుణ ఓటమికి దారి తీసిందని అభిప్రాయపడుతున్నాయి.

భద్రాద్రిలో తేట'తెల్లం'

భద్రాచలంలో బీఆర్ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావు కాంగ్రెస్ అభ్యర్థి, సీనియర్ ఎమ్మెల్యే పొదెం వీరయ్యపై గెలుపొందారు. జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ గాలి బలంగా వీచినా దానికి ఎదురొడ్డి 'కారు' దూసుకుపోవడం వెనుక నియోజకవర్గంలో తెల్లం వెంకట్రావుకు ఉన్న క్లీన్ ఇమేజ్ చాలా వరకు దోహదం చేసింది. మరో నాలుగైదు రోజుల్లో పోలింగ్ ఉందనే వరకు ఇతరులపై ఆధారపడిన తెల్లం చివరి నిమిషంలో మేల్కొన్నారు. తన గెలుపు బాధ్యత తానే తీసుకోవాలి అన్నట్టుగా రూటు మార్చి దూకుడు పెంచారు. అన్ని పనుల్లో చొరవ చూపారు. ఫలితంగా ఎంతో కాలంగా ఊరిస్తున్న విజయాన్ని సొంతం చేసుకున్నారు.

డిపాజిట్లు గల్లంతు


జిల్లాలో ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు కొత్తగూడెంలో జలగం వెంకట్రావును మినహాయిస్తే మిగిలిన అందరి డిపాజిట్లు గల్లంతయ్యాయి. నామినేషన్ సందర్భంగా చెల్లించే డిపాజిట్‌ను తిరిగి పొందాలంటే ఆ నియోజకవర్గంలో పోలైన ఓట్లలో కనీసం ఆరో వంతు సాధించాల్సి ఉంటుంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులను మినహాయిస్తే మిగిలిన అభ్యర్థులు డిపాజిట్లు దక్కించుకోలేకపోయారు. వారిలో బీజేపీ, సీపీఎం, బీఎస్పీ అభ్యర్థులు సైతం ఉన్నారు.

గ్లాసు పగిలింది..

ఎన్నికల పర్యటనలో భాగంగా ప్రతీ నియోజకవర్గంలో ఐదారువేల ఓట్లు జనసేనకు ఉన్నట్టు ఆ పార్టీ చీఫ్ పవన్‌కళ్యాణ్ వెల్లడించారు. అయితే అశ్వారావుపేట, కొత్తగూడెంలో పోటీ చేసిన ఆ పార్టీ అభ్యర్థులు రెండు వేలకు అటు ఇటుగానే ఓట్లు పొందగలిగారు. బీజేపీ మద్దతుతో పోటీ చేసినా కూడా ఎక్కడా తమ ప్రభావం చూపించలేకపోయారు. బీజేపీ పరిస్థితి ఇంతకంటే దారుణంగా మారింది. ఆ పార్టీ తరఫున ఇల్లెందు నుంచి రవీందర్ నాయక్, భద్రాచలం నుంచి కుంజా ధర్మా వంటి సీనియర్ నాయకులతో పాటు పినపాక నుంచి పొడియం బాలరాజు వంటి బ్యూరోక్రాట్ బరిలో ఉన్నా.. అంతా నామమాత్రంగానే మిగిలారు. ఎన్నికల్లో ఎలాంటి ప్రభావం చూపలేకపోయారు. ఇక జిల్లా వ్యాప్తంగా ఒక్క ఓటు కూడా రిజెక్ట్ కాలేదు.

■ ఫలించని రేగా వ్యూహాలు

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా గడిచిన మూడు నెలలుగా రేగా కాంతారావు వ్యూహాలు రచిస్తూ వచ్చారు. అసమ్మతి నేతలను కలిసేందుకు సెక్యూరిటీని సైతం పక్కన పెట్టి టూ వీలర్లపై ఒంటరి ప్రయాణం చేశారు. ఎన్నికల్లో గెలుపు కోసం బూత్ స్థాయిలో ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి పకడ్బందీగా పోలింగ్ దశ వరకు వచ్చారు. కానీ చివరి నిమిషంలో వచ్చిన కాంగ్రెస్ వేవ్ ముందు రేగా వ్యూహాలు కొట్టుకుపోయాయి. గతంలో పొంగులేటి వర్గంతో ఆయన పెట్టుకున్న కయ్యం, తన వర్గం నేతలతో తప్ప మిగిలిన వారితో కలుపుగోలు తనం చూపకపోవడం కూడా ఆయనకు మైనస్‌గా మారాయి. ఫలితంగా తన చిరకాల రాజకీయ ప్రత్యర్థి పాయం వెంకటేశ్వర్లు చేతిలో అనూహ్య ఓటమి పాలయ్యారు. నువ్వా - నేనా అన్నట్టుగా ఉంటుందనుకున్న పోటీ పూర్తిగా పాయం వైపు మొగ్గు చూపింది. దీంతో లెక్కింపు మధ్యలోనే రేగా కౌంటింగ్ కేంద్రాన్ని వీడి వెళ్లారు.





పాయం వెంకటేశ్వర్లు | రేగా కాంతారావు

విజేతకు పోలైన ఓట్లు : 90,510
మెజారిటీ : 34,506
రెండో స్థానం : రేగా కాంతారావు (బీఆర్ఎస్) 56,004
మూడో స్థానం : పొడియం బాలరాజు (బీజేపీ)



తెల్లం వెంకట్రావు | పొదెం వీరయ్య

విజేతకు పోలైన ఓట్లు : 53,252
మెజారిటీ : 5,719
రెండో స్థానం : పొదెం వీరయ్య (కాంగ్రెస్) - 47,533
మూడో స్థానం : కారం పుల్లయ్య (సీపీఎం)



కోరం కనకయ్య | బానోతు హరిప్రియ

విజేతకు పోలైన ఓట్లు : 1,09,171
మెజారిటీ : 57,309
రెండో స్థానం : బానోతు హరిప్రియ (బీఆర్ఎస్) : 51,862
మూడో స్థానం : రవీందర్ నాయక్ (బీజేపీ)



జారె ఆదినారాయణ | మెచ్చా నాగేశ్వరరావు

విజేతకు పోలైన ఓట్లు : 74,993
మెజారిటీ : 28,905
రెండో స్థానం : మెచ్చా నాగేశ్వరరావు (బీఆర్ఎస్) - 46,088
మూడో స్థానం : పిట్టల అర్జున్ (సీపీఎం)



కూనంనేని సాంబశివరావు | జలగం వెంకటరావు

విజేతకు పోలైన ఓట్లు : 80,336
మెజారిటీ : 26,547
రెండో స్థానం : జలగం వెంకటరావు (ఫార్వర్డ్ బ్లాక్) - 53,789
మూడో స్థానం : వనమా (బీఆర్ఎస్)



పొంగులేటి శ్రీనివాసరెడ్డి | కందాళ ఉపేందర్‌రెడ్డి

విజేతకు పోలైన ఓట్లు : 1,27,820
మెజారిటీ : 56,650
రెండో స్థానం : కందాళ ఉపేందర్‌రెడ్డి (బీఆర్ఎస్) ఓట్లు : 71,170
మూడో స్థానం : తమ్మినేని వీరభద్రం (సీపీఎం)



తుమ్మల నాగేశ్వరరావు | పువ్వాడ అజయ్‌కుమార్

విజేతకు పోలైన ఓట్లు : 1,36,016
మెజారిటీ : 49,381
రెండో స్థానం : పువ్వాడ అజయ్‌కుమార్ (బీఆర్ఎస్) ఓట్లు : 86,635
మూడో స్థానం : ఎం.రామకృష్ణ (జనసేన)



మల్లు భట్టివిక్రమార్క | లింగాల కమల్‌రాజ్

విజేతకు పోలైన ఓట్లు : 1,08,970
మెజారిటీ : 35,452
రెండో స్థానం : లింగాల కమల్‌రాజ్ (బీఆర్ఎస్) ఓట్లు : 73,518
మూడో స్థానం : పాలడుగు భాస్కర్ (సీపీఎం)



మాలోతు రాందాస్ నాయక్ | బానోతు మదన్‌లాల్

విజేతకు పోలైన ఓట్లు : 93,913
మెజారిటీ : 33,045
రెండో స్థానం : బానోతు మదన్‌లాల్ (బీఆర్ఎస్) ఓట్లు : 60,868
మూడో స్థానం : భూక్యా వీరభద్రం (సీపీఎం)



మట్టా రాగమయి | సండ్ర వెంకట వీరయ్య

విజేతకు పోలైన ఓట్లు : 1,11,245
మెజారిటీ : 19,440
రెండో స్థానం : సండ్ర వెంకటవీరయ్య (బీఆర్ఎస్) ఓట్లు : 91,805
మూడో స్థానం : ఎస్‌రామలింగేశ్వరరావు (బీజేపీ)

నేల విడిచి సాము !

- ఫిరాయింపులను ప్రోత్సహించడంపైనే గులాబీ దళం దృష్టి
- పోల్ మేనేజ్‌మెంట్‌లో నిర్లక్ష్యం
- కొంప ముంచిన అతి విశ్వాసం
- ఫలితాలతో కంగుతిన్న బీఆర్ఎస్ శ్రేణులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం : అసెంబ్లీ ఎన్నికలకు సరిగ్గా మూడు నెలల ముందు వరకు జిల్లాలో గులాబీ దళానికి ఎదురెళ్లి నెగ్గుకొచ్చే పరిస్థితి ఏ పార్టీకి లేదంటే అతిశయోక్తి కాదు. రాబోయే ఎన్నికల్లో ఐదుకు ఐదు స్థానాల్లో కారుదే జోరని నాయకులు ఎలుగెత్తి చాటారు. కానీ చివరకు ఎన్నికల్లో ఆ పార్టీ తరఫున పోటీ చేసిన అభ్యర్థులు బొక్కబోర్లా పడ్డారు. కంటి తుడుపు అన్నట్టుగా అత్తెసరు మెజారిటీతో భద్రాచలం స్థానాన్ని దక్కించుకున్నారు.

ఫిరాయింపులపైనే దృష్టి..

గత ఆగస్టులో ఐదు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాక గెలుపుపై బీఆర్ఎస్ పెద్దలు దృష్టి సారించారు. ఇల్లెందు, కొత్తగూడెం నియోజకవర్గాలకు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, భద్రాచలానికి ఎమ్మెల్సీ తాతా మధు, అశ్వారావుపేటకు ఎంపీ నామా నాగేశ్వరరావును ఇన్‌చార్జ్‌లుగా నియమించి ఎన్నికల వ్యూహాలు అమలుచేశారు. సొంత పార్టీలో ఎమ్మెల్యేలపై అప్పటి వరకు గూడుకట్టుకుని ఉన్న అసమ్మతిని చక్కదిద్దడంపై దృష్టి సారించకుండా ఇతర పార్టీలకు చెందిన నేతలకు వల వేయడంపైనే ఎక్కువ సమయం కేటాయించారు. ఈ క్రమంలో ఇతర పార్టీలకు చెందిన తాటి వెంకటేశ్వర్లు, సున్నం నాగమణి, వగ్గెల పూజ, కొడకండ్ల వెంకట్ రెడ్డి, కోనేరు చిన్ని, ఎడవల్లి కృష్ణ, మడత వెంకట్ గౌడ్, రావులపల్లి సీతారామయ్య, కొత్తగూడెం మున్సిపాలిటీకి చెందిన సీపీఐ కౌన్సిలర్లు.. ఇలా ఒక్కొక్కరినీ 'కారు' ఎక్కించారు. అప్పటికే నేతలతో కిక్కిరిసిన గులాబీ గ్యాంగులో కొత్త దళం చేరికతో ఉక్కపోత మరింతగా ఎక్కువైంది. ఎన్నికల ప్రచారం, పార్టీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన నాయకత్వంలో అంతర్గత పోరు చాపకింద నీరులా పాకింది. ప్రచారం కంటే ప్రాధాన్యంపైనే దృష్టి ఎక్కువైంది.

పోల్ మేనేజ్‌మెంట్‌లో విఫలం..

పోల్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా ఓటర్ స్లిప్పులు పంచడం, ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తీసుకురావడం వంటి పనుల నిర్వహణలోనూ గులాబీ శ్రేణులు విఫలమయ్యాయి. పై స్థాయి నుంచి కింది వరకు ఇదే పరిస్థితి కనిపించింది. పోలింగ్ మొదలైన మొదటి రెండు గంటల్లో హస్తం హవా కనిపించిన తర్వాతే గులాబీ గ్యాంగ్ కళ్లు తెరిచింది. ఆ తర్వాత తమకు మద్దతుగా ఉండే ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు శ్రమించినా అప్పటికే సమయం మించిపోయింది. ఐదుకు ఐదు స్థానాలు గెలుస్తామనే దశ నుంచి కేవలం ఒక సీటుకే పరిమితం కావడం ఆ పార్టీ శ్రేణులకు మింగుడుపడటం లేదు. కనీసం ఏ ఒక్క చోట కూడా గట్టిపోటీ ఇవ్వలేని విధంగా 'చేతి' కింద 'కారు' చిత్తయింది.

ఆఖరి వరకు అతి విశ్వాసం..

క్షేత్ర స్థాయిలో వేగంగా మారుతున్న ఓటరు నాడిని పట్టుకోవడంలో బీఆర్ఎస్ నేతలు నిర్లక్ష్యం చేశారు. ఆధిపత్య పోరులో పడి అసలు సంగతి పక్కన పెట్టారు. ఉదాహరణకు కొత్తగూడెం మున్సిపల్ కౌన్సిలర్లు ప్రచారం కంటే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తమకు తిరిగి టికెట్లు ఇవ్వాలనే డిమాండ్‌పైనే దాదాపు నెలరోజులకు పైగా సపరేట్ క్యాంప్ నడిపారు. ఇల్లెందులోనూ ఈ తరహా పరిస్థితి నెలకొని చివరకు మున్సిపల్ చైర్మన్ పార్టీని వీడారు. ఇంత జరుగుతున్నా ఇటు అభ్యర్థులు, అటు ఇన్‌చార్జ్‌లు తామే గెలుస్తామనే అతి విశ్వాసం కనబరుస్తూ వచ్చారు.

చేయి చేయి కలిపారు..

- ఎన్నికల పోరులో విజయం సాధించారు
- కాంగ్రెస్ శ్రేణుల్లో ఫుల్ జోష్..





బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకుంటున్న కాంగ్రెస్, సీపీఐ కార్యకర్తలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఎన్నికలకు ఆరు నెలల ముందు వరకు జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మనుగడే ప్రశ్నార్థకం అన్న పరిస్థితి నెలకొంది. అంతటా లెక్కకు మిక్కిలిగా కేడర్ ఉన్నా బలమైన నాయకుడు లేక బీఆర్ఎస్ కొడుతున్న వరుస దెబ్బలను కాచుకోవడం కష్టమనే పరిస్థితి ఉండేది. అయితే ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తర్వాత రెండు నెలల వ్యవధిలోనే వర్గపోరుకు నెలవైన కాంగ్రెస్‌లో ఐక్యతారాగం వెల్లివిరిసింది. అసమ్మతి గళం వినిపించే నేతలకు ఎగ్జిట్ గేట్ చూపించిన అధిష్టానం విధేయులను ఏకతాటిపైకి తీసుకొచ్చింది. దీంతో అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్య విజయం సాధించింది.

- ఇల్లెందు స్థానం నుంచి ఏకంగా 32 మంది అభ్యర్థులు పోటీకి ఆసక్తి చూపించారు. తమలో ఎవరికి టికెట్ ఇచ్చినా ఓకే కానీ బీఆర్ఎస్ నుంచి వచ్చిన కోరం కనకయ్యకు ఇవ్వొద్దని అల్టిమేటమ్ ఇచ్చారు. కానీ కాంగ్రెస్ పెద్దలు వీటిని పట్టించుకోకుండా కోరం కనకయ్యకే టికెట్ ఇచ్చారు. దీన్ని వ్యతిరేకిస్తూ చీమల వెంకటేశ్వర్లు రెబల్‌గా పోటీ చేయగా, కామేపల్లి జెడ్పీటీసీ ప్రవీణ్ మరికొందరు ఆశావహులు పార్టీని వీడారు. అయినప్పటికీ తొణకకుండా పార్టీలో మిగిలిన వారిని కాంగ్రెస్ ఒక్కతాటిపైకి తెచ్చింది. నియోజకవర్గ స్థాయిలో బీఆర్ఎస్‌లో ఉన్న లుకలుకలు కూడా కాంగ్రెస్‌కు కలిసొచ్చాయి. ఫలితంగా 57 వేలకు పైగా మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపొందారు.
- పినపాక, అశ్వారావుపేటలోనూ అసమ్మతి స్వరాలు వినిపించినా పార్టీ పెద్దలు సముదాయించారు. దీంతో బట్టా విజయ్‌గాంధీ, పోలేబోయిన శ్రీవాణి, చందా సంతోష్ వంటి వారు అలక వీడి పార్టీ కోసం పని చేశారు. అశ్వారావుపేటలో అసమ్మతి నేతలు బటయకు వెళ్లారు. ఇక మిగిలిన కొద్ది సమయంలో అంతర్గత పోరు లేకుండా ప్రచారం చేశారు. గెలుపు తీరాన్ని తాకారు. ఏ ఒక్క రౌండ్‌లోనూ బీఆర్ఎస్‌కు అవకాశం ఇవ్వకుండా విజయం వైపు దూసుకుపోయారు.
- దశాబ్దాల తరబడి ఉప్పు, నిప్పులా ఉన్న కాంగ్రెస్, సీపీఐ మధ్య పొత్తు సాధ్యం కాదనే భావన ఆరంభంలో బలంగా నెలకొంది. సీపీఐకి సీటు కేటాయించి కాంగ్రెస్ తప్పు చేసిందని పలువురు అభిప్రాయపడ్డారు. కానీ రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే ఏ ఒక్క సీటునూ తేలికగా తీసుకోవద్దనే నిర్ణయానికి వచ్చిన కాంగ్రెస్ శ్రేణులు సీపీఐకి సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. దీంతో కాంగ్రెస్ క్రాస్ ఓటింగ్‌పై గట్టిగా నమ్మకం పెట్టుకున్న బీఆర్ఎస్, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థుల ఆశలు అడియాసలు అయ్యాయి. అందరి అంచనాలు తలకిందులు చేస్తూ కూనంనేని భారీ మెజార్టీతో విజయం సాధించారు. జిల్లాలో నాలుగు స్థానాల్లో విజయం సాధించడం, రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో మధ్యాహ్నం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు కాంగ్రెస్, సీపీఐ శ్రేణులు ఊరువాడా సంబరాలు చేసుకున్నారు.

విజేతలు వీరే..

ఉమ్మడి జిల్లాలోని పది శాసనసభ నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచిన అభ్యర్థుల వివరాలు, రాజకీయ, కుటుంబ నేపథ్యాలు ఇలా ఉన్నాయి. – సాక్షి నెట్‌వర్క్‌

ఇల్లెందు (కాంగ్రెస్‌)

పేరు : కోరం కనకయ్య
భార్య పేరు : కోరం లక్ష్మి
విద్యార్హత : బీఏ
వయసు : 61 సంవత్సరాలు
వృత్తి : వ్యవసాయం
గ్రామం : కోయగూడెం, టేకులపల్లి మండలం



గెలుపు ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

రాజకీయ నేపథ్యం : 1986లో బేతంపూడి పీఏసీఎస్‌ డైరెక్టర్‌, 1995లో టేకులపల్లి జెడ్పీటీసీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 2004లో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్‌ ఎస్టీ సెల్‌ కన్వీనర్‌గా పనిచేశారు. 2014లో కాంగ్రెస్‌ నుంచి ఇల్లెందు ఎమ్మెల్యేగా గెలుపొందారు. అనంతరం బీఆర్‌ఎస్‌లో చేరారు. 2018లో బీఆర్‌ఎస్‌ నుంచి బరిలో దిగి ఓటమి చెందారు. ఆ తర్వాత టేకులపల్లి జెడ్పీటీసీగా గెలిచి జెడ్పీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. కొన్ని నెలల ముందు పొంగులేటితోపాటు కాంగ్రెస్‌లో చేరిన ఆయన మరోసారి ఇల్లెందు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

పినపాక (కాంగ్రెస్‌)

పేరు: పాయం వెంకటేశ్వర్లు
వయసు: 49
తండ్రి : కామరాజు(లేటు),
తల్లి : రాములమ్మ
భార్య: ప్రమీల,
సంతానం : ఇద్దరు పిల్లలు
పుట్టిన తేదీ : 06.05.1974
జన్మస్థలం : బండారుగూడెం, మణుగూరు మండలం
విద్యార్హత : బీఏ
గ్రామం: సమితిసింగారం, మణుగూరు


గెలుపు ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

రాజకీయ నేపథ్యం: పాయం వెంకటేశ్వర్లు 1986 నుంచి 1992 వరకు ఏఐఎస్‌ఎఫ్‌, 1992 నుంచి 1999 వరకు ఏఐవైఎఫ్‌లో పనిచేశారు. 1993 నుంచి సీపీఐ బండారుగూడెం గ్రామశాఖ కార్యదర్శిగా పనిచేసిన ఆయన.. అనంతరం పార్టీ రాష్ట్ర కౌన్సిల్‌ సభ్యుడిగా ఎన్నికయ్యారు. బూర్గంపాడు సెగ్మెంట్‌లో 1999లో సీపీఐ నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. 2004లో గెలిచారు. అనంతరం వైఎస్సార్‌ సీపీలో చేరి 2014లో పినపాక ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ తర్వాత బీఆర్‌ఎస్‌లో, సుమారు ఆరు నెలల క్రితం పొంగులేటితోపాటు కాంగ్రెస్‌లో చేరారు. తాజాగా కాంగ్రెస్‌ నుంచి బరిలో దిగి, పినపాకలో మరోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

భద్రాచలం (బీఆర్‌ఎస్‌)

పేరు: తెల్లం వెంకట్రావు
స్వస్థలం: దుమ్ముగూడెం మండలం సూరారం గ్రామం
తల్లిదండ్రులు: బాపనయ్య, జానకమ్మ
పుట్టిన తేది: జనవరి 25, 1967
వృత్తి: వైద్యుడు
విద్యార్హత: ఎంబీబీఎస్‌(సిద్దార్థ మెడికల్‌ కళాశాల, విజయవాడ)
ఎంఎస్‌(ఉస్మానియా మెడికల్‌ కళాశాల, హైదరాబాద్‌)
భార్య: ప్రవీణ,
పిల్లలు: ఇద్దరు కుమార్తెలు, విద్యను అభ్యసిస్తున్నారు


భద్రాచలం ఎమ్మెల్యేగా గెలిచిన బీఆర్‌ఎస్‌ అభ్యర్థి తెల్లం వెంకట్రావుకు గెలుపు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న రిటర్నింగ్‌ అధికారి మంగీలాల్‌

భద్రాచలం నియోజకవర్గంలో గతంలో ప్రభుత్వ వైద్యుడిగా పనిచేశారు. అనంతరం ఉద్యోగానికి రాజీనామా చేసి వైఎస్సార్‌ సీపీలో చేరిక ద్వారా రాజకీయాల్లోకి ప్రవేశించారు. తొలుత 2014లో మహబూబాబాద్‌ ఎంపీగా వైఎస్సార్‌ సీపీ తరఫున పోటీ చేసి ఓటమి పొందారు. అనంతరం బీఆర్‌ఎస్‌లో చేరి 2018లో భద్రాచలం నియోజకవర్గం ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పొందారు. అనంతరం పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. భద్రాచలం టికెట్‌ను సిట్టింగ్‌ ఎమ్మెల్యే పొదెం వీరయ్యకు కేటాయించటంతో నెలరోజుల్లోనే మళ్లీ బీఆర్‌ఎస్‌లో చేరారు. గులాబీ టికెట్‌ పొంది పొదెం వీరయ్యపై విజయం సాధించారు.

ఖమ్మం (కాంగ్రెస్‌)

పేరు : తుమ్మల నాగేశ్వరరావు
జననం : 15 నవంబర్‌ 1953
స్వస్థలం : గండుగులపల్లి, దమ్మపేట మండలం
భార్య : భ్రమరాంబ
సంతానం : కుమారుడు యుగంధర్‌, కుమార్తెలు మోహిని, చంద్రిక



గెలుపు ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న ఖమ్మం ఎమ్మెల్యే తుమ్మల నాగేశ్వరరావు

రాజకీయ నేపథ్యం : 1982లో టీడీపీలో చేరిన తుమ్మల నాగేశ్వరరావు తొలిసారి ఎన్నికల్లో ఓటమి చెందారు. 1985లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో గెలుపొందారు. ఆ తర్వాత 1994, 1999, 2009 ఎన్నికల్లో వరుసగా టీడీపీ నుంచి గెలిచి ఆర్‌అండ్‌బీ, భారీ నీటిపారుదల మంత్రిగా పనిచేశారు. అనంతరం బీఆర్‌ఎస్‌లో చేరి 2015లో శాసన మండలి సభ్యుడిగా నియమితులయ్యారు. ఆర్‌అండ్‌బీ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. బీఆర్‌ఎస్‌ నుంచి 2016లో ఉప ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచారు. గత సెప్టెంబర్‌లో కాంగ్రెస్‌లో చేరి, ఖమ్మం నుంచి బరిలో దిగి, విజయం సాధించారు.

వైరా (కాంగ్రెస్‌)

పేరు: మాలోత్‌ రాందాస్‌ నాయక్‌
స్వగ్రామం: ఎదురుగడ్డ, లక్ష్మీదేవిపల్లి మండలం, భద్రాద్రి కొత్తగూడెం
తల్లిదండ్రులు: లక్ష్మి, హనుమా
విద్యాభ్యాసం: బీకాం
భార్య: లలిత, ఏఎన్‌ఎం
ఇద్దరు కుమార్తెలు : డాక్టర్‌ గాయత్రి, డాక్టర్‌ చందన
కుమారుడు : మాలోత్‌ విగ్నేష్‌, బీటెక్‌
ప్రస్తుత నివాసం : వైరా


గెలుపు ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న వైరా ఎమ్మెల్యే రాందాస్‌ నాయక్‌

రాజకీయ అనుభవం: ఎన్‌ఎస్‌యూఐ ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యదర్శిగా, యూత్‌ కాంగ్రెస్‌ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. కొత్తగూడెం సొసైటీ డైరెక్టర్‌గా పని చేశారు. 2007 నుంచి 2009 వరకు కొత్తగూడెం టీడీపీ మండలాధ్యక్షుడిగా, టీడీపీ ఎస్టీసెల్‌ జిల్లా అధ్యక్షుడిగా పని చేశారు. టీడీపీ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జిగా పనిచేసి అనంతరం కాంగ్రెస్‌లో చేరారు. 2018 నుంచి పీసీసీ సభ్యుడు, జిల్లా ఎస్టీ సెల్‌ అధ్యక్షుడు, రాష్ట్ర ఎస్టీసెల్‌ ఉపాధ్యక్షుడిగా పని చేస్తున్నారు.

కొత్తగూడెం (సీపీఐ)

పేరు: కూనంనేని సాంబశివరావు
తండ్రిపేరు: వెంకటరత్నం
పుట్టిన తేది: 14.1.1956, విద్యార్హత: డిగ్రీ
భార్య: ప్రమీలాదేవి
సంతానం: కుమారుడు భరత్‌, కూతురు క్రాంతి



గెలుపు ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని

రాజకీయ నేపథ్యం: తొలుత జర్నలిజం వృత్తి చేపట్టిన కూనంనేని విశాలాంధ్ర దినపత్రికలో సబ్‌ ఎడిటర్‌/రిపోర్టర్‌గా మూడేళ్లు పనిచేశారు. అనంతరం సీపీఐ కొత్తగూడెం డివిజన్‌ కార్యదర్శిగా, ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్నారు. 1987 నుంచి 1992 వరకు కొత్తగూడెం ఎంపీపీగా పనిచేశారు. 1999, 2004లో సుజాతనగర్‌ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. 2009లో కొత్తగూడెం ఎమ్మెల్యేగా గెలిచారు. 2014లో ఓటమి చెందిన ఆయన, తాజా ఎన్ని కల్లో కాంగ్రెస్‌ బలపర్చిన సీపీఐ అభ్యర్థిగా మరో సారి ఎమ్మెల్యేగా గెలిచారు. అనేక కార్మిక, ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించిన కూనంనేని మూడుసార్లు జైలు జీవితం గడిపారు.

పొంగులేటి శ్రీనివాసరెడ్డి తరఫున గెలుపు ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న ఆయన సోదరుడు ప్రసాదరెడ్డి


పాలేరు (కాంగ్రెస్‌)

పేరు : పొంగులేటి శ్రీనివాసరెడ్డి
జననం : 28, అక్టోబర్‌ 1965
స్వస్థలం : నారాయణపురం, కల్లూరు మండలం
తల్లిదండ్రులు : రాఘవరెడ్డి – స్వరాజ్యం
విద్యాభ్యాసం : బీఏ, భార్య : మాధురి,
కుమారుడు : హర్షారెడ్డి, కుమార్తె : సప్నిరెడ్డి

రాజకీయ నేపథ్యం: పొంగులేటి 2013లో వైఎస్సార్‌ కాంగ్రెస్‌లో చేరి, తెలంగాణ ఏర్పడ్డాక పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులయ్యారు. 2014లో ఖమ్మం లోక్‌సభ సభ్యుడిగా గెలుపొందారు. రవాణా, పర్యాటక శాఖ పార్లమెంటరీ స్టాండింగ్‌ కమిటీ సభ్యులుగా ఉన్నారు. 2016 బీఆర్‌ఎస్‌లో చేరారు. గత జూలై 2న రాహుల్‌గాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరి, ప్రచార కమిటీ కో చైర్మన్‌గా నియమితులయ్యారు. తాజా ఎన్నికల్లో పాలేరు ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

మధిర (కాంగ్రెస్‌)

పేరు : మల్లు భట్టి విక్రమార్క
జననం : 15-06-1961
తల్లిదండ్రులు : అఖిలాండ – మాణెమ్మ
స్వస్థలం : స్నానాల లక్ష్మీపురం, వైరా
విద్యార్హత : ఎంఏ, భార్య : నందిని
కుమారులు: సూర్యవిక్రమాదిత్య, సహేంద్ర విక్రమాదిత్య


గెలుపు ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క

రాజకీయ నేపథ్యం: మల్లు భట్టి 1994 నుంచి 2000 వరకు ఆంధ్రాబ్యాంకు డైరెక్టర్‌గా పనిచేశారు. 2007లో ఎమ్మెల్సీగా ఎన్నికై 2009 మార్చి వరకు కొనసాగారు. 2009లో మధిర ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రభుత్వ చీఫ్‌ విప్‌గా, అసెంబ్లీ ఉప సభాపతిగా వ్యవహరించారు. 2014లో రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచి సీఎల్పీ నేతగా ఎన్నికయ్యారు. 2015లో టీపీసీసీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. 2018లో మూడోసారి గెలిచి, సీఎల్పీ నేతగా కొనసాగుతున్నారు. తాజాగా నాలుగోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

సత్తుపల్లి (కాంగ్రెస్‌)

పేరు : డాక్టర్‌ మట్టా రాగమయి
భర్త : డాక్టర్‌ మట్టా దయానంద్‌
పిల్లలు : నీలోత్పల, విపంచి, విరాజి
విద్యాభ్యాసం: ఎంబీబీఎస్‌, డీటీసీడీ (ఛాతీవైద్యురాలు)
వయస్సు : 52 సంవత్సరాలు



గెలుపు ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న ఎమ్మెల్యే రాగమయి

రాజకీయ నేపథ్యం: డాక్టర్‌ మట్టా దయానంద్‌ సతీమణిగా పరిచయం. ఆమె అత్త డాక్టర్‌ మట్టా ఆరోగ్యం ఎంపీపీగా పనిచేశారు. మామ మట్టా కృష్ణమూర్తి స్వాతంత్ర్య సమరయోధుడు. 2014 ఎన్నికల్లో పోటీ చేసేందుకు సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రిలో డాక్టర్‌గా పనిచేస్తున్న రాగమయి ఉద్యోగానికి రాజీనామా చేశారు. అయితే ఆ ఎన్నికల్లో వైఎస్సార్‌ సీపీ అభ్యర్థిగా బరిలోకి దిగిన ఆమె భర్త దయానంద్‌ రెండువేల ఓట్ల తేడాతో ఓటమి చెందారు. ఈసారి కూడా దయానంద్‌ పోటీకి దిగాలని భావించినా కుల ధ్రువీకరణపై వివాదం తలెత్తడంతో రాగమయి రాజకీయంగా తెరపైకి వచ్చారు. కాగా తన కూతురు అకాల మరణంతో ఆషా పేరిట స్వచ్ఛంద సేవా సంస్థ స్థాపించి రక్తదాన, వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు.

అశ్వారావుపేట (కాంగ్రెస్‌)

పేరు: జారె ఆదినారాయణ
జన్మదినం: 08.07.1983
తండ్రి పేరు: సత్యనారాయణ
విద్య: ఎమ్మెస్సీ, బీపీఈడీ
భార్య: వరలక్ష్మి (ప్రభుత్వ టీచర్‌)
పిల్లలు: కుమార్తె, కుమారుడు
స్వగ్రామం: గండుగులపల్లి, దమ్మపేట



గెలుపు ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న ఎమ్మెల్యే జారె

రాజకీయ నేపథ్యం : అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వ ఉపాధ్యాయుడు(పీఈటీ)గా పని చేశారు. 2014 సంవత్సరంలో ఉద్యోగానికి రాజీనామా చేసి, అశ్వారావుపేట అసెంబ్లీ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌ నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. తిరిగి 2018 ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ నుంచి టికెట్‌ ఆశించినా దక్కలేదు. ఈ ఏడాది మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి కాంగ్రెస్‌లో చేరి, 2023 ఎన్నికల్లో విజయం సాధించారు.

క్లుప్తంగా

అందరితో కలిసి 'జారె ' భోజనం


కౌంటింగ్‌ కేంద్రం వద్ద భోజనం చేస్తున్న ఆదినారాయణ

పాల్వంచ : పాల్వంచలోని ఎన్నికల కౌంటింగ్‌ కేంద్రంలో అశ్వారావుపేట ఎమ్మెల్యేగా గెలుపొందిన జారె ఆదినారాయణ అందరితో కలిసి క్యూలో నిల్చుని భోజనం చేశారు. ఆదివారం వెలువడిన ఫలితాల్లో ఆయన 28,606 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అనంతరం రిటర్నింగ్‌ అధికారి రాంబాబు నుంచి ధ్రువపత్రం అందుకున్నారు.

కాంగ్రెస్‌ వైపే కార్మికలోకం..

ఇల్లెందు: జిల్లాలో కార్మిక లోకం కాంగ్రెస్‌కు జై కొట్టింది. కార్మిక జిల్లాగా పేరొందిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నాలుగు స్థానాలు హస్తం పార్టీ కైవసం చేసుకుంది. ఇల్లెందు, పినపాక, అశ్వారావుపేటలలో కాంగ్రెస్‌, కొత్తగూడెంలో మిత్రపక్షం సీపీఐ విజయం సాధించాయి. భద్రాచలంలో మాత్రం బీఆర్‌ఎస్‌ విజయం సాధించింది. ఇల్లెందులో సింగరేణి కార్మికులు కనకయ్యకు మద్దతుగా నిలిచారు. పినపాకలో మణుగూరు సింగరేణి, బీటీపీఎస్‌ కార్మికులు, సారపాక ఐటీసీ కార్మికులు కాంగ్రెస్‌ వైపు మొగ్గు చూపారు. ఇక కొత్తగూడెంలో సింగరేణి, కేటీపీఎస్‌, నవభారత్‌ తదితర కర్మాగారాల కార్మికులు కాంగ్రెస్‌ బలపర్చిన సీపీఐ పక్షాన నిలిచారు. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీలు అండగా నిలిచి గెలుపులో భాగస్వాములయ్యాయి. అశ్వారావుపేటలో కూడా కార్మికులు చేయి గుర్తుకే మద్దతుగా నిలిచారు.

రాగమయి... సత్తుపల్లి తొలి మహిళా ఎమ్మెల్యే

సత్తుపల్లి/సత్తుపల్లిటౌన్‌: సత్తుపల్లి తొలి మహిళ ఎమ్మెల్యేగా మట్టా రాగమయి ఘన విజయం సాధించారు. సత్తుపల్లి నియోజకవర్గం ఏర్పడిన 72 ఏళ్లలో మహిళకు పట్టం కట్టడం ఇదే మొదటిసారి. ప్రభుత్వ వైద్యురాలైన ఆమె 2014లో తన భర్త డాక్టర్‌ మట్టా దయానంద్‌కు మద్దతుగా ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఆ ఎన్నికల్లో నామినేషన్‌ వేసినప్పటికీ ఉపసంహరించుకుని భర్తకు మద్దతుగా ప్రచారం చేశారు. ఈసారి దయానంద్‌ ఎస్సీ సర్టిఫికెట్‌ కలెక్టర్‌ రద్దు చేయడంతో క్రియాశీలక రాజకీయాల్లోకి అడుగు పెట్టి గెలిచారు.

ప్రత్యర్థులు వారే.. పార్టీలే వేరు

- పినపాకలో పాయం, రేగా..
- ఇల్లెందులో కనకయ్య, హరిప్రియ
- కొత్తగూడెంలో వనమా, జలగం
- అశ్వారావుపేటలో జారె, తాటి, మెచ్చా

బూర్గంపాడు/అశ్వారావుపేట: జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో గత మూడు నాలుగు దఫాలుగా అభ్యర్థులు పార్టీలు మారినా పరస్పరం వారే తలపడ్డారు.

పినపాకలో..
పినపాక అసెంబ్లీ నియోజకర్గంలో పాయం వెంకటేశ్వర్లు, రేగా కాంతారావు మూడుసార్లు ముఖాముఖి పోటీపడ్డారు. 2009లో కాంగ్రెస్‌ నుంచి రేగా కాంతారావు, సీపీఐ నుంచి పాయం వెంకటేశ్వర్లు పోటీ చేయగా, రేగా విజయం సాధించారు. 2018లో మళ్లీ రేగా కాంతారావు కాంగ్రెస్‌ నుంచి, పాయం వెంకటేశ్వర్లు బీఆర్‌ఎస్‌ నుంచి పోటీపడగా, కాంతారావు విజయం సాధించారు. 2023లో పాయం వెంకటేశ్వర్లు కాంగ్రెస్‌ నుంచి, బీఆర్‌ఎస్‌ నుంచి రేగా కాంతారావు పోటీ పడగా, పాయం గెలుపొందారు.

కొత్తగూడెంలో..
కొత్తగూడెంలో 2014లో బీఆర్‌ఎస్‌ నుంచి జలగం వెంకట్రావు, వైఎస్సార్‌సీపీ నుంచి వనమా వెంకటేశ్వరరావు పోటీ చేయగా, జలగం విజయం సాధించారు. 2018లో జలగం వెంకట్రావు బీఆర్‌ఎస్‌ నుంచి, వనమా కాంగ్రెస్‌ నుంచి పోటీ పడగా, వనమా గెలిచారు. 2023లో బీఆర్‌ఎస్‌ అభ్యర్థిగా వనమా, ఆలిండియా ఫార్వర్డ్‌ బ్లాక్‌ నుంచి జలగం పోటీపడ్డారు. ఈ ఎన్నికల్లో వీరిద్దరిని కాదని కొత్తగూడెం ఓటర్లు సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావుకు పట్టం కట్టారు.

ఇల్లెందులో..
ఇల్లెందు నియోజకవర్గంలో 2014లో కాంగ్రెస్‌ నుంచి కోరం కనకయ్య, టీడీపీ నుంచి బానోతు హరిప్రియ పోటీపడగా, కనకయ్య విజయం సాధించారు. 2018లో బీఆర్‌ఎస్‌ నుంచి కోరం, కాంగ్రెస్‌ నుంచి హరిప్రియ పోటీ పడగా.. హరిప్రియ గెలిచారు. 2023లో బానోతు హరిప్రియ బీఆర్‌ఎస్‌ నుంచి, కాంగ్రెస్‌ నుంచి కోరం పోటీ పడగా, కోరం విజయం సాధించారు.

అశ్వారావుపేటలో..
అశ్వారావుపేట అసెంబ్లీ నియోజకవర్గంలో 2009లో కాంగ్రెస్‌ నుంచి వగ్గెల మిత్రసేన, మహాకూటమి(సీపీఎం) నుంచి పాయం వెంకయ్య పోటీ చేయగా, అప్పుడు టీడీపీ నాయకులుగా ఉన్న తాటి వెంకటేశ్వర్లు, మెచ్చా నాగేశ్వరరావులు వెంకయ్య తరఫున పనిచేశారు. అయితే ఈ ఎన్నికల్లో మిత్రసేన గెలిచారు. 2014లో వైఎస్సార్‌ సీపీ తరఫున తాటి వెంకటేశ్వర్లు, టీడీపీ నుంచి మెచ్చా నాగేశ్వరరావు, బీఆర్‌ఎస్‌ నుంచి జారె ఆదినారాయణ పోటీ చేయగా, ఈ ఎన్నికల్లో తాటి గెలిచారు. 2018 టీడీపీ నుంచి మెచ్చా నాగేశ్వరరావు, బీఆర్‌ఎస్‌ నుంచి తాటి వెంకటేశ్వర్లు పోటీ చేయగా, తాటి తరఫున జారె ఆదినారాయణ పనిచేశారు. ఈ ఎన్నికల్లో మెచ్చా గెలిచారు. 2023లో బీఆర్‌ఎస్‌ నుంచి మెచ్చా నాగేశ్వరరావు, కాంగ్రెస్‌ నుంచి జారె ఆదినారాయణ పోటీ చేయగా, జారె విజయం సాధించారు. అయితే ఈ ఎన్నికల్లో తాటి వెంకటేశ్వర్లు మెచ్చా తరఫున పనిచేశారు.

ఎన్నికల ప్రక్రియ ప్రశాంతం

పాల్వంచ : జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ ప్రియాంక ఆల తెలిపారు. ఎన్నికల నిర్వహణలో జిల్లా ప్రజల సహాయ సహకారాలు మరువలేనివని పేర్కొన్నారు. తీవ్రవాద ప్రభావిత ప్రాంతమైన జిల్లాలో ఎన్నికలు సజావుగా నిర్వహించడంలో భాగస్వామ్యం వహించిన అధికారులు, అనధికారులు, ప్రజలు, పాత్రికేయులకు కృతజ్ఞతలు తెలిపారు.

కౌంటింగ్‌ కేంద్రం పర్యవేక్షణ
పాల్వంచలోని అనుబోస్‌ ఇంజనీరింగ్‌ కళాశాలలో ఆదివారం నిర్వహించిన ఎన్నికల కౌంటింగ్‌ ప్రక్రియను ప్రియాంక ఆల పర్యవేక్షించారు. ఎక్కడ ఎలాంటి లోటుపాట్లు వచ్చినా వెంటనే సరిదిద్దాలని సిబ్బందిని ఆదేశించారు. పలుమార్లు ఆన్‌లైన్‌ సమస్యలు ఏర్పడగా బాధ్యులతో మాట్లాడి పరిష్కరించారు. ఆమె వెంట రిటర్నింగ్‌ అధికారులు ప్రతీక్‌ జైన్‌, రాంబాబు, మంగీలాల్‌, శిరీష, కార్తీక్‌, డీఆర్‌డీఓ మధుసూదన్‌ రాజు, పరిశీలకులు కమల్‌ కిశోర్‌, హరికిశోర్‌, వివేక్‌ కుమార్‌, గణేశ్‌, కంటి శేఖర్‌ సింగ్‌ ఉన్నారు.

'బాలసాని' ఐరన్‌ లెగ్‌..!

భద్రాచలం: భద్రాచలం నియోజకవర్గంలో బాలసాని ఐరన్‌లెగ్‌ అంటూ ప్రతిపక్ష నాయకులు అప్పుడే విమర్శలకు తెర లేపారు. 2018 ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ తరఫున తెల్లం వెంకట్రావ్‌ పోటీ చేయగా నాడు బాలసాని లక్ష్మీనారాయణ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు. ఆ ఎన్నికల్లో బాలసాని వ్యవహార శైలితోనే ఓడిపోయామని బీఆర్‌ఎస్‌ నేతలు బాహాటంగానే వెల్ల డించారు. ఇక ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన బాలసాని ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా వ్యవహరించగా.. ఇప్పుడు కాంగ్రెస్‌ అభ్యర్థి పొదెం వీరయ్య ఓటమి పాలయ్యారు. దీంతో బాలసానిది ఐరన్‌ లెగ్‌ అంటూ బీఆర్‌ఎస్‌ నాయకులు విమర్శలకు పదును పెడుతున్నారు. కాగా బాలసాని లక్ష్మీనారాయణ సొంత మండలమైన వెంకటాపురంలోనూ ఆయన ప్రభావం కనిపించలేదు.

శాసనసభకు వైద్యులు, పీఈటీ

అశ్వారావుపేట: చట్టసభల్లో ప్రాతినిధ్యం వహించే వారిలో విద్యావంతుల వాటా పెరుగుతోంది. ఆదివారం వెల్లడైన తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికల ఫలితాల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఇద్దరు వైద్యులు, ఒక వ్యాయామ ఉపాధ్యాయుడు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. మరో వ్యాయామ ఉపాధ్యాయుడు పరాజయం పాలయ్యారు. అశ్వారావుపేట ఎమ్మెల్యేగా గెలుపొందిన జారె ఆదినారాయణ(కాంగ్రెస్‌) గతంలో ప్రభుత్వ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేశారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఉద్యోగానికి రాజీనామా చేశారు. భద్రాచలం ఎమ్మెల్యేగా గెలుపొందిన తెల్లం వెంకట్రావు(బీఆర్‌ఎస్‌) ఎంబీబీఎస్‌ వైద్యుడు కాగా భద్రాచలంలోనే ప్రాక్టీస్‌ చేస్తున్నారు. సత్తుపల్లి ఎమ్మెల్యేగా గెలిచిన మట్టా రాగమయి ప్రభుత్వ వైద్యురాలిగా అశ్వారావుపేట, సత్తుపల్లి నియోజకవర్గాల్లోని పలు పీహెచ్‌సీలలో విధులు నిర్వర్తించారు. ఆ తర్వాత ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసినా వైద్యవృత్తిలో కొనసాగుతున్నారు. ఇక పినపాక నుంచి బీఆర్‌ఎస్‌ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమికి గురైన రేగా కాంతారావు గతంలో పీఈటీగా పనిచేసి బీఆర్‌ఎస్‌ తీసుకున్నారు.

రీ షెడ్యూలా? పాత షెడ్యూలా?

సింగరేణి గుర్తింపు ఎన్నికలపై సందిగ్ధం!

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు ప్రకటించిన షెడ్యూల్‌ ప్రకారం నిర్వహిస్తారా? రీ షెడ్యూల్‌ చేస్తారా? అనే విషయమై సందిగ్ధం నెలకొంది. సోమవారం హైదరాబాద్‌లోని డిప్యూటీ చీఫ్‌ లేబర్‌ కమిషనర్‌ కార్యాలయంలో ఎన్నికలకు సంబంధించిన సమావేశం నిర్వహించనున్నారు. గతంలోనే ఎన్నికలు నిర్వహించేందుకు షెడ్యూల్‌ ప్రకటించగా, కార్మిక సంఘాలు నామినేషన్లు కూడా సమర్పించాయి. అయితే హైకోర్టు తీర్పు నేపథ్యంలో డిసెంబర్‌ 27న నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఆ ప్రకారం ఎన్నికలు నిర్వహిస్తే ఇంకా 22 రోజుల సమయం మాత్రమే ఉంటుంది. ప్రచారం చేసుకునే సమయం తక్కువగా ఉంటుందని కార్మిక సంఘాల నాయకులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో సందిగ్ధం నెలకొంది. కాగా శాసనసభా ఎన్నికల ప్రక్రియ ఆదివారంతో ముగియడంతో అధికారులు ఇక సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలపై దృష్టి సారించే అవకాశం ఉంది.



ఎస్పీ పర్యవేక్షణ..


కౌంటింగ్‌ కేంద్రం వద్ద పోలీస్‌ అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ వినీత్‌

పాల్వంచ: పాల్వంచలోని అనుబోస్‌ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల కౌంటింగ్‌ కేంద్రం వద్ద ఆదివారం ఎస్పీ డాక్టర్‌ వినీత్‌ పర్యవేక్షణ చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. విధుల్లో ఉన్న సిబ్బందిని అప్రమత్తం చేస్తూ, సూచనలు అందించారు.

గండుగులపల్లి నుంచి ఇద్దరు విజేతలు!

ఒకే పార్టీ నుంచి గెలిచిన తుమ్మల, జారె

అశ్వారావుపేట: 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలుగా ఒకే పార్టీ నుంచి ఎన్నికయ్యారు. అశ్వారావుపేట ఎమ్మెల్యేగా జారె ఆదినారాయణ, ఖమ్మం ఎమ్మెల్యేగా తుమ్మల నాగేశ్వరరావు కాంగ్రెస్‌ పార్టీ నుంచి ఆదివారం వెల్లడించిన ఫలితాల్లో ఎమ్మెల్యేలుగా విజయం సాధించారు. వీరిద్దరూ అశ్వారావుపేట నియోజకవర్గం దమ్మపేట మండలం గండుగులపల్లి గ్రామానికి చెందినవారు కావడం ప్రత్యేకతను సంతరించుకుంది. కాగా తుమ్మల నాగేశ్వరరావు టీడీపీ, టీఆర్‌ఎస్‌ కేబినెట్‌లలో మంత్రిగా పనిచేశారు. జారె ఆదినారాయణ బీఆర్‌ఎస్‌ నుంచి 2014లో పోటీచేసి ఓటమి పాలయ్యారు. తాజాగా కాంగ్రెస్‌ నుంచి గెలిచి తొలిసారి అసెంబ్లీలో అడుగు పెట్టనున్నారు. సీఎం కేసీఆర్‌ సిట్టింగ్‌లకు సీట్‌ ఇవ్వడంతో పొంగులేటిని ఆశ్రయించి కాంగ్రెస్‌ సీటును జాక్‌పాట్‌లా దక్కించుకున్నారు. ఎమ్మెల్యే కావడం కోసం ప్రభుత్వ ఉద్యోగాన్ని త్యజించిన ఆయన పదిహేనేళ్ల కలను సాకారం చేసుకున్నారు.